క్లుప్తంగా

సామాజిక కార్యకర్తకు సన్మానం



నరహరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: నర్సాపూర్‌కు చెందిన సామాజిక కార్యకర్త నరహరిని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి గురువారం సన్మానించి అభినందించారు. పట్టణంలోని 9వ వార్డుకు చెందిన నరహరి కొన్నేళ్లుగా ప్లాస్టిక్ వాడకుండా ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంగా స్టీలు ఇతర వస్తువులు వినియోగించడంతో పాటు ప్లాస్టిక్‌పై తన ఇరుగు పొరుగుకు అవగాహన కల్పిస్తున్నాడు. అతను ప్లాస్టిక్ కవర్లను వాడక పోవడంతో పాటు ఇతరులకు అవగాహన కల్పిస్తున్నాడన్న విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడంతో ఆయన నరహరిని సన్మానించి అభినందించారు. ప్రతీ ఒక్కరు ఎవరికి వారు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఆయన హితవు పలికారు.

పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

అల్లాదుర్గం(మెదక్): కుల, మతాలకు అతీతంగా పండగలు జరుపుకోవాలని ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండగ సందర్భంగా ప్రతీ ఒక్కరూ అన్నదమ్ములా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ పెంటప్ప, నేతలు బల్‌రాం, సూర్యకుమార్, శ్రీశైలం, తదితరులు పాల్గొ న్నారు.

కొత్త పాస్ పుస్తకాల వివరాలు ఇవ్వాలి

నర్సాపూర్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న రైతుబంధు పథకం కింద ఆర్థిక సహాయం పొందడానికి రైతులు తమతో సహకరించాలని స్థానిక వ్యవసాయ శాఖ ఏడీఏ సురేఖ కోరారు. ఆమె బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పోడు భూములకు కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులు, బ్యాంకు ఖాతాల్లో, పాస్‌పుస్తకాల ఖాతాలు దిద్దుబాటుకు గురైన రైతులు తమ తాజా సమాచారాన్ని, ఆధార్ వివరాలతో కలిపి వ్యవసాయ ఏఈఓలకు అందజేయాలని ఆమె సూచించారు.

‘ఆ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి’

చేగుంట(తూప్రాన్): కాలుష్య కారక పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీపీ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వడియారం గ్రామ శివారులో ఏపీఎల్ అపోలో పరిశ్రమ నుంచి వస్తున్న వ్యర్థాలతో భుగర్భ జలాలు కలుషితమై పంటలు పండటం లేదన్నారు. పరిశ్రమ సమీపంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ ఉండగా బోరుబావి నుంచి కలుషిత నీరు వస్తుండటంతో ప్రజలు అస్వస్థతకు గురవుతున్నారు. సదరు పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్‌క్లబ్ కృషి



సభ్యత్వ నమోదు రశీదు అందజేస్తున్న దృశ్యం

మెదక్ కలెక్టరేట్: సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రతీ జర్నలిస్ట్ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉందని మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని అజంపురలోని షాదీఖానాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ సభ్యత్వాన్ని అందజేశారు. సమావేశంలో ప్రెస్ క్లబ్ బాధ్యులు దేవయ్య, కిషన్, రాజు, గోపాల్, తదితరుల ఉన్నారు.

బచ్చురాజ్‌పల్లిలో గ్రామసభ

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని జెడ్ చెరువు తండా గ్రామంలో బుధవారం కాళేశ్వరం కాల్వ భూనిర్వాసితులతో భూములు కోల్పోతున్న గ్రామానికి సంబంధించి 40 మంది రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ గంగాధర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 13 మల్లన్న సాగర్ కాల్వ ద్వారా డిస్ట్రిబ్యూషన్ 7ఆర్ కెనాల్ కాల్వ పనుల నిర్మాణం కొరకు 40మంది రైతులకు సంబంధించి 17ఎకరాల 23 గుంటల భూమిలో కాల్వ పనులు చేపట్టడానికి భూములు ఇవ్వాలని తెలిపారు. రైతులు మా భూముల్లో కాల్వ పనులు జరగనివ్వమని ఆర్డీఓ ఆఫీసర్ సత్యనారాయణకు రైతుల డిమాండ్స్ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతులు బాల్య, పుల్యా నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోరా?

మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల మండిపాటు



సమావేశంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని అసైన్డ్‌మెంట్ భూముల్లో అక్రమ నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రశ్నించారు. నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్ మాట్లాడుతూ.. పట్టణంలోని 79, 731 సర్వే నంబర్లలోని అసైన్‌మెంట్ భూముల్లో అక్రమంగా వెంచర్లు చేయడంతో పాటు అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నా.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, వాటిపై చర్యలు తీసుకోవాలని సమావేశంలో కమిషనర్ వెంకట్‌గోపాల్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్ ఫిర్యాదుపై కమిషనర్ స్పందిస్తూ.. తాను రెవెన్యూ శాఖకు గతంలోనే సమాచారం ఇచ్చానని చెప్పారు. పట్టణంలో సీసీరోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత సరిగా ఉండడం లేదని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, కౌన్సిలర్ అశోక్‌గౌడ్ తదితరులు ఆరోపించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోయినా సంబంధిత శాఖల అధికారులు ఏం చేస్తున్నారని వారు ప్రశ్నించారు. అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతోనే పనుల్లో నాణ్యత లోపిస్తుందని, పలు రోడ్ల నిర్మాణంలో ఇసుకను నిబంధనల మేరకు వాడడం లేదని, రాక్ సాండ్ వినియోగిస్తూ సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని దీంతో రోడ్ల నాణ్యత లోపించి ప్రభుత్వ ధనం వృథా అవుతుందని, రోడ్లు నిర్మించే సమయంలో పర్యవేక్షించాలని వారు పీఆర్ డీఈఈ రాధికలక్ష్మి, ఏఈ స్వామిదాస్‌లకు సూచించారు. సీసీ రోడ్ల పనులు పూర్తి చేసిన మేరకు ఎంబీ రికార్డులు సైతం వెంటనే చేయనందున ఇబ్బందులు ఎదురవుతున్నాయని కౌన్సిలర్ యాదగిరి, రాజేందర్‌లు చెప్పారు. కాగా వెంచర్ రికార్డులను పరిశీలించాలని అందులో ఉన్న భూముల వివ రాలు సేకరించాలని, హెచ్ఎండీఏ నిబంధనల మేరకు మున్సిపాలిటీకి పది శాతం భూమిని రిజిస్ట్రేషన్ చేసే వరకు వెంచర్‌లో ఎలాంటి పనులకు అనుమతించొద్దని పలువురు కౌన్సిలర్లు కమిషనర్‌ను కోరారు. తాము కౌన్సిలర్లు కొనుగోలు చేసి తెచ్చిన ఫాగింగ్ మిషన్లకు డబ్బు చెల్లించాలని పలువురు కౌన్సిలర్లు కోరగా, బిల్లులు చాలా ఎక్కువగా ఉన్నాయని, ధరలు పరిశీలించిన తర్వాత బిల్లులు చెల్లించాలని మిగిలిన కౌన్సిలర్లు అధికారులకు సూచించారు.

అస్తవ్యస్తంగా ‘భగీరథ’ నీటి సరఫరా

- పట్టించుకోని అధికారులు
- అల్లాదుర్గం సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న నడిమితండా సర్పంచ్

అల్లాదుర్గం(మెదక్): మిషన్ భగీరథ నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని, ఎప్పుడు నీళ్లు వస్తాయో తెలియడం లేదని, తాగు నీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నట్లు అల్లాదుర్గం మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అల్లాదుర్గంలో ఎంపీపీ అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పారం, కోమటి కుంట, నడిమితండా గ్రామాల్లో తాగు నీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నట్లు సర్పంచ్‌లు రంజీత్, సుభాష్ చెప్పారు. మిషన్ భగీరథ నల్లాలు ఉన్న ఎందుకు పనికి రావడం లేదన్నారు. కోమటి కుంటతండా నీటి సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఎంపీపీ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు. ముప్పారంలో భగీరథ నల్లాను తొలగించారని, నల్లాలో చెర్రలను తీసివేసి, కరెంట్ మోటార్లు పెట్టుకొని నీటిని పట్టుకోవడంతో, మరికొంత మందికి సరఫరా కావడం లేదని రఘునాథ్ చెప్పారు. నీటి సరఫరా సమయంలో విద్యుత్ నిలిపివేస్తే మోటార్లు పెట్టుకోరని ఎంపీపీ చెప్పారు. ముప్పారం గ్రామంలో ఆరోగ్య కేంద్ర భవనం నిర్మించిన ప్రారంభించడం లేదని, దీంతో రోగు లకు సరైన వైద్యం అందడంలేదని సర్పంచ్ సుభాష్ అన్నారు. మంత్రితో భవనం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీపీ సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, డాక్టర్ అశ్విని, ఏఓ రాజేశ్, పీఆర్ ఏఈ విజయ్, ఇరిగేషన్ ఏఈ తిలక్‌రాజ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

‘ఈటలను ఎదుర్కొనే సత్తా బీఆర్ఎస్‌కు లేదు’

పెద్దశంకరంపేట(మెదక్): అవినీతిపై పోరాడుతున్న ఈటల రాజేందర్‌ను ఎదుర్కొనే సత్తా బీఆర్ఎస్ నాయకులకు లేదని బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి తన అనుచరులతో ఈటల రాజేందర్‌ను హత మార్చేందుకు కుట్రపన్నుతున్నారని ఆయన సతీమణి జమున చేసిన వాఖ్యలు నిజమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈటలకు వై కేటగిరి భద్రత కల్పించడం సరైందన్నారు. నాయకులు శ్రావణ్‌కుమార్, సాయిలు, కృష్ణ, విలాస్, కిషన్ తదితరులున్నారు.

సమ్మెనోటీసు అందజేత

కొడిపల్లి(నర్సాపూర్): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కారానికి జూలై 6 నుంచి సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ తెలిపారు. బుధవారం కొడిపల్లిలో మండల గ్రామ పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ బలరాంకు సమ్మెనోటీసులు అందజేశారు. వివిధ గ్రామాల కార్మికులు సామెల్, పద్మారావ సాయిలు, జయమ్మ, సుమలత, నర్సమ్మ, లింగం, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విస్తారక్‌లకు స్వాగతం పలికిన నేతలు

నర్సాపూర్: రాష్ట్రానికి వచ్చిన బీజేపీ విస్తారక్‌లకు బీజేపీ నాయకులు బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో స్వాగతం పలికారు. తమిళనాడు నుంచి సుమారు 500ల మంది పార్టీ విస్తారక్‌లు తెలంగాణకు వచ్చారని బీజేపీ నర్సాపూర్ నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్ చెప్పారు. వారిలో నర్సాపూర్ నియోజకవర్గానికి ఏడుగురు విస్తారక్‌లు వస్తారని, నియోజవకర్గంలో పర్యటించి పార్టీ పరిస్థితులు పరిశీలిస్తారని చెప్పారు. పార్టీ మెదక్ పార్లమెంట్ కన్వీనర్ రామోహ్మన్‌గౌడ్ ఉన్నారన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నివాళి**

నర్సాపూర్: భారత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకొని బుధవారం కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేశ్, అశోక్, ఉదయ్ తదితరులు ఉన్నారు.

◆ **అసంపూరి పనులు పూర్తి చేయండి**

నర్సాపూర్ రూరల్: మండలంలోని రుస్తుంపేటలో అసంపూర్తిగా వదిలేసిన పనులను పూర్తి చేయాలని మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, వార్డు సభ్యులు ఈశ్వర్, వీరమ్మ శ్రీశైలం, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగయ్య కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. చెరువు శిఖం భూమిలో నిర్మించిన వైకుంఠధామం అసంపూర్తిగా వదిలేశారని ఆరోపించారు. డంప్‌యార్డ్ నిర్వాహణ చేపట్టడం లేదన్నారు. పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం పనులు అసంపూర్తిగా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంపీడీఓ మార్టిన్ లూథర్‌ను వివరణ కోరగా. పల్లె ప్రకృతి వనం పను లు త్వరలో పూర్తి చేస్తామన్నారు.

◆ **బోర్ మోటారు బిగింపు**

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని కురుమ కాలనీ వాసులకు నెల రోజుల క్రితం మైనంపల్లి రోహిత్ సహకారంతో నూతన బోరు వేయించడంతో మంగళవారం అందులో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మహేందర్ సహకారంతో మోటార్ బిగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నసీరుద్దీన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ **చట్టాలపై అవగాహన**

పాపన్నపేట(మెదక్): ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ ఎస్ఐ మల్లయ్య అన్నారు. బుధవారం కొత్తపల్లి ఉన్నతపాఠశాలలో షీటీం కళా బృందంతో కలిసి విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. సక్రు బాయి, నరేందర్, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

◆ **కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం**

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో బుధవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి శవయాత్ర నిర్వహించి, దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనతో పాటు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఆందోళనలో సంఘం ప్రతినిధులు రామస్వామి, శ్రీనివాస్, రాము లు, యాదగిరి, స్వామి, భిక్షపతి, తదితరులు పాల్గొన్నార్యు.

◆ **మొక్కల సంరక్షణ అందరి బాధ్యత**

చిలప్‌చెడ్(నర్సాపూర్): హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత అందరిదని కార్యదర్శులు రవిశంకర్‌రెడ్డి, నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని అంతారం, ఫైజాబాద్ గ్రామాల శివారులో మొక్క లు నాటేందుకు తీస్తున్న గుంతలను వారు పరిశీలించారు.

◆ **ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడిగా జాల శ్యామ్**

చిన్నశంకరంపేట(మెదక్): మండల ముదిరాజ్ మహసభ మండల కమిటీ అధ్యక్షుడిగా జాల శ్యామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో ముదిరాజ్ మహాసభ మెదక్ నియోజవర్గ అధ్యక్షుడు జాల సాయిబాబా ఆధ్వర్యంలో చిన్నశంకరంపేట మండల ముదిరాజ్ మహసభ మండల కమిటీని ఎన్నుకున్నారు. ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడిగా తీగుల్ల స్వామి, రాజు, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కార్యదర్శిగా రాజు, సహయ కార్యదర్శిగా రాములు, ప్రధాన సలహదారుగా శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ముదిరాజ్ మహసభ నియోజవర్గ అధ్యక్షులు జాల సాయిబాబా తెలిపారు. అలాగే మండల మత్స్యశాఖ కమిటీ అధ్యక్షుడిగా రెడ్డి శ్రీనివాస్‌ని నియమించారు.

◆ **పాఠశాలల పరిశీలన**

నిజాంపేట(మెదక్): మండలంలోని నస్కల్, రాంపూర్, చల్మెడ, నగరం, గ్రామాల్లోని పాఠశాలలను బుధవారం ఎంఈఓ నీలకంఠ సందర్శించి, పాఠశాలలో ఎంబీఎం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీ రాజు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **పెండింగ్ స్కాలర్‌షిప్‌లు తక్షణమే విడుదల చేయాలి**

టేక్మాల్(మెదక్): రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని అదేవిధంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.నరేష్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో పేద విద్యార్థులు పై చదువులను చదువులేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్నటువంటి స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్తీక్, సంతోష్, ప్రభాకర్, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

◆ **జులై 10 లోపు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి**

నర్సాపూర్ రూరల్: జులై 10లోపు చిప్పల్‌తుర్తిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆ గ్రామ దళితులతో పాటు దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం దళిత సంఘాల నాయకులు, గ్రామ దళితులతో కలిసి సమావేశం నిర్వహించుకున్నారు. అంతకు ముందు కొంతమంది చిప్పల్‌తుర్తి గ్రామ యువ దళితులు రెడ్డిపల్లి వద్ద కొద్ది సేపు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు సంజీవులు, పంబల భిక్షపతి, ఎడారి నాగరాజు, శాంతయ్య, గణేష్, నర్సింలు, మహిళలు పాల్గొన్నారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో 11 ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు జూలై 3 నుంచి 13 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం 85558 94019, 99590 03736 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికివద్ద గల డాక్టర్ డి. రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో యంగ్ ప్రొఫెషనల్1, 2 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంబాజీ దత్తాత్రేయ నల్కర్, సీనియర్ సైంటిస్ట్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు మెదక్ జిల్లా కేవీకే వెబ్‌సైట్ చూడాలన్నారు. దీంతో పాటు ఫోన్‌నంబర్ 75690 39446 సంప్రదించాలని సూచించారు.

◆ **పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి**

మెదక్ కలెక్టరేట్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్లు మాట్లాడుతూ.. రూ.398 స్పెషల్ టీచర్లు, పండితులు, పీఈటీల సర్వీస్ కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇస్తూ పెన్షనరీ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. ఈమేరకు కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నర్సింహరెడ్డి, నరేశ్, వెంకన్న, జీవరత్నం, నరేందర్‌రెడ్డి, బాగయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన**

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామంలో బుధవారం సాయంత్రం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్టివిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో తిరిగి నివసిస్తున్న వ్యక్తులు ఆధార్ ఇతర వివరాలను నమోదు చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేని 28 బైకులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామంలో సమావేశం నిర్వహించి తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న నేరాలు, దొంగతనాలు, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్, చిన్నశంకరంపేట, నార్సింగి, నిజాంపేట పోలీస్‌స్టేషన్‌ల ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **విరాళం**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ ఆలయ అభివృద్ధికి దాత ఉమ్మడి రాష్ట్ర మాజీ బార్ కౌన్సిల్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి రూ.5 లక్షల విరాళం బుధవారం అందజేసినట్లు బగలాముఖీ ఉపాసకుడు, వేద పండితుడు వెంకటేశ్వరశర్మ తెలిపారు.



ఎస్సీ కాలనీలో పర్యటిస్తున్న డీఎల్‌పీఓ రాజేంద్రప్రసాద్

కదిలిన అధికార యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్

అల్లాదుర్గం(మెదక్): ‘ఇదేనా..పల్లె ప్రగతి?’ శీర్షికన బుధవారం ‘సాక్షి’లో ప్రచురితం అయిన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా వెంటనే డీఎల్‌పీఓ రాజేంద్ర ప్రసాద్‌ను గ్రామానికి పంపించి విచారణ చేయించారు. గ్రామంలో ఇళ్ల మధ్య ఉన్న పిచ్చి మొక్కలు, రోడ్డు పక్కన వేసిన చెత్తను పంచాయతీ సిబ్బందితో తొలగింపజేశారు. పాత ఎస్సీ కాలనీలో రోడ్లు శుభ్రం చేయించడంతో పాటు ఎస్సీ, వడ్డెర కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో పశువుల తొట్టి నిరుపయోగంగా మారడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధిలో మురుగు నీరు నిలుస్తుందని స్థానికులు వివరించారు. అనంతరం డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య, చెత్తను తొలగించే పనులు ఇప్పటికే చేపట్టామని తెలిపారు. 15 రోజుల్లో మురికి కాలువ నిర్మించి, సిమెంట్ రోడ్డు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు. పనులు చేయకుంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, సర్పంచ్ అంజయ్య యాదవ్, కార్యదర్శి సవిత, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశం ఎందుకు?

సింధోల్ సర్పంచ్ మంజుల



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సింధోల్ సర్పంచ్ మంజుల

రేగోడ్(మెదక్): సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకని సింధోల్ సర్పంచ్ మంజుల మండిపడ్డారు. తమ గ్రామంలో అభివృద్ధి పనులు చేసినా.. బిల్లులు సకాలంలో ఎందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఎంపీపీ వచ్చినా ఎంపీడీఓపై ఆగ్రహంతో సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. అయితే 2 గంటలకు సమావేశం నిర్వహించాల్సి ఉన్నా 2 గంటల 45 నిమిషాలకు ఎంపీడీఓ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి వచ్చారు. 3 గంటలు దాటినా సమావేశం ప్రారంభం కాలేదు. మూడు నెలలకోమారు నిర్వహించే సమావేశాలకు అందరూ హాజరు కావాలని ఎంపీడీఓ సీతారావమ్మ అన్నారు. ఈ క్రమంలో సింధోల్ సర్పంచ్ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కారం కానిది సమావేశాలు ఎందుకన్నారు. అభివృద్ధి పనులు చేయమంటారు.. బిల్లులు రాకపోతే ఎలా అని మండిపడ్డారు. పూర్తి స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు డుమ్మా కొట్టారు. మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు లేకపోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నానని, తిరిగి ఈనెల 30న నిర్వహిస్తామని ఎంపీడీఓ సుమారు 3గంటల 45 నిమిషాలకు తెలిపారు.

దళిత మహిళననే చిన్నచూపు

- ఎంపీడీఓ తనను అవమానిస్తున్నారని ఆవేదన
- సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీపీ సరోజన
- దశాబ్ది ఉత్సవాల నిధులు పక్కదారి: కోఆప్షన్ సభ్యుడు చోటుమియా



సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించి వెళ్తున్న ఎంపీపీ సరోజన తదితరులు

రేగోడ్(మెదక్): ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం తనకు సరిగా ఇవ్వడం లేదని, దళిత మహిళననే నాపై చిన్న చూపు చూస్తున్నారని ఎంపీడీఓపై ఎంపీపీ సరోజన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తనకు సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని బుధవారం ఎంపీడీఓ సీతారావమ్మను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విలేకరులతో మాట్లాడారు. ప్రోగ్రాం ఉందన్న గంట ముందు, ఒక్కోసారి కార్యాలయం సిబ్బందితో సమాచారం ఇస్తున్నారని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా తనను అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు గౌరవం ఇవ్వకుండా రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని చెప్పారు. కార్యాలయంలో ఎంపీడీఓ సరిగా అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎంపీడీఓ తీరుకు నిరసనగా బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు జరగా ల్సిన సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించి కార్యాలయం నుంచి వెళ్లితున్నట్లు ప్రకటించారు. దశాబ్ది ఉత్సవాల నిధులు పక్కదారి పట్టిస్తున్నారని కోఆప్షన్ సభ్యుడు చోటుమియా విలేఖరుల సమావేశంలో అన్నారు. నిధులు ఇష్టారాజ్యంగా ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిధుల ఖర్చు పై విచారణ జరపాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వినీల, తిమ్మాపూర్ సర్పంచ్ నిర్మ ల ఉన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మహిళలు సరైన పోషకాహారం తింటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడంతో పాటు, రక్తహీనత భారీన పడకుండా ఉంటారని నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఫైజాబాద్–2 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సెక్టార్ సమావేశానికి సర్పంచ్ మనోహరతో పాటు, సీడీపీఓ హేమభార్గవి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 2వ వీహెచ్ఎస్ఎన్‌డీ(విలేజ్ హెల్త్, శానిటేషన్, న్యూట్రి షన్ డే) కార్యక్రమంలో భాగంగా తల్లులకు పోషణ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హేమభార్గవి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సమయపాలన ప్రకారం ప్రీస్కూల్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లిపాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారణ గురించి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత, అంగన్‌వాడీ టీచర్ శశికళ, మహిళలు పాల్గొన్నారు.

అనుమతి ఉన్న విత్తనాలనే అమ్మాలి



చిలప్‌చెడ్ రైతుసేవా కేంద్రంలో విత్తన నమూనాలు సేకరిస్తున్న ఏఓ బాల్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫర్టిలైజర్ దుకాణాల్లో ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, విత్తనాలనే అమ్మాలని చిలప్‌చెడ్ మండలం వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన చిలప్‌చెడ్ గ్రామంలోని అగ్రో రైతు సేవా కేంద్రాన్ని ఏఓ బాల్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రో రైతు సేవా కేంద్రంలో విత్తనాలు, తదితర స్టాక్ పరిశీలించడంతో పాటు రికార్డులు తనిఖీ చేశామన్నారు. అదేవిధంగా రైతు సేవా కేంద్రంలో విత్తనాల నమూనాలు సేకరించామన్నారు. ఈ విత్తనాలను రాజేంద్రనగర్ లాబ్‌కు పంపిస్తామన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు శ్రీనివాస్ ఉన్నాడు.

వ్యర్థాల పారబోతపై జరిమానా



పరిశ్రమ ప్రతినిధికి జరిమానా విధిస్తున్న పంచాయతీ కార్యదర్శి స్వామిగౌడ్

మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను పట్టా భూమిలో పారబోతపై పంచాయతీ కార్యదర్శి స్వామిగౌడ్ వేసిన వారికి, పారబోయించిన వారికి బుధవారం జరిమానా విధించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని ప్రైమా ఫుడ్‌టెక్ ప్రాసెసింగ్ యూనిట్ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను గ్రామానికి చెందిన నరాల పెంటన్న తన సర్వే నంబర్ 45లో పారబోయిస్తున్నాడన్నారు. కాగా కుళ్ళిన వ్యర్థాలతో దుర్వాసన వస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై పంచాయతీ పాలకవర్గ తీర్మానం మేరకు వ్యర్థాలు పారబోసినందుకు పరిశ్రమకు, పారబోయించినందుకు పెంటన్నకు చేరో రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు.